# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

**ప్రాంతీయ వార్తలు**

**తేది : 24-09-2024** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

**1.** **మానవాళి విజయం మన సమష్టి శక్తిలో దాగి ఉందని, యుద్ధ భూమిలో కాదని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఉద్ఘాటించారు.**

**2.** **ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలు పట్టణంలో హై కోర్టు బెంచి ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని ముఖ్యమంత్రి ఎన్. చంద్రబాబు నాయుడు ప్రకటించారు.**

**3.** **తెలంగాణా రాష్ట్రంలో కుటుంబ డిజిటల్ కార్డులు జారీ చేయడానికి అధికారులు చర్యలు తీసుకోవాలని ముఖ్య మంత్రి ఎ. రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు.**

**4.** **తెలంగాణా రాష్ట్రంలో ధాన్యం కొనుగోలు కోసం 7 వేల 139 కేంద్రాలు ఏర్పాటు చేసినట్టు పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు.**

**5.** **ఆంధ్రప్రదేశ్‌లో వరద బాధితుల సహాయానికి సంబంధించి రెవిన్యూ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది.**

**6.** **బంగాళా ఖాతంలో ఉపరితల ఆవర్తనం కారణంగా ఉభయ తెలుగు రాష్ట్రాలలో రానున్న మూడు రోజులలో వర్షాలు కురిసే అవకాశం ఉంది.**

=========================

మానవాళి విజయం మన సమష్టి శక్తిలో ఉందని ...., యుద్ధ భూమిలో కాదని ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ఉద్ఘాటించారు. అమెరికా పర్యటనలో ఆయన న్యూయార్క్ లోని ఐక్య రాజ్య సమితి జనరల్ అసెంబ్లీలో గత రాత్రి జరిగిన "సమ్మిట్ ఆఫ్ ది ఫ్యూచర్"ను ఉద్దేశించి ప్రసంగిస్తూ ... ప్రపంచ శాంతి ..., అభివృద్ధి కోసం అంతర్జాతీయ సంస్థలలో సంస్కరణలు అవసరమని అభిప్రాయం వ్యక్తం చేశారు. ప్రపంచ భవిష్యత్ గురించి అంతర్జాతీయ సమాజం చర్చిస్తున్న సందర్భంలో మానవ కేంద్రీకృత విధానాలకు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వవలసిన అవసరం ఉందని ..., ఈ దిశగా డిజిటల్ మౌలిక వసతులను ప్రపంచంతో పంచుకునేందుకు భారత దేశం సిద్ధంగా ఉందని నరేంద్రమోడీ ప్రకటించారు.

-------------------------

ఆంధ్ర ప్రదేశ్ లోని కర్నూలు పట్టణంలో హై కోర్టు బెంచి ఏర్పాటు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉ ందని ముఖ్య మంత్రి ఎన్. చంద్రబాబు నాయుడు తెలిపారు. న్యాయ శాఖపై అమరావతిలో నిన్న నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ...... త్వరలో జరగనున్న మంత్రివర్గ సమావేశంలో కర్నూలులో

హై కోర్టు బెంచి ఏర్పాటు చేయాలన్న తీర్మానాన్ని ఆమోదించి కేంద్ర ప్రభుత్వానికి పంపుతామని పేర్కొన్నారు. అమరావతిలో న్యాయ కళాశాల ఏర్పాటు అంశాన్ని కూడా ఆయన ఈ సమావేశంలో సమీక్షించారు. బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ట్రస్టు ద్వారా వంద ఎకరాల్లో న్యాయ కళాశాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించామని, జూనియర్ న్యాయవాదులకు శిక్షణ అకాడమి ఏర్పాటు చేయడానికి కార్యాచరణ సిద్ధం చేయాలని ఈ సందర్భంగా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు.

---------------------------

తెలంగాణా రాష్ట్రంలో రేషన్ ...., ఆరోగ్య ..., ఇతర సంక్షేమ పథకాలను ఒకే కార్డు ద్వారా అమలు చేసేందుకు కుటుంబ డిజిటల్ కార్డులు జారీ చేయడానికి కార్యాచరణ చేపట్టాలని ముఖ్య మంత్రి ఎ. రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు.

వైద్య ..., ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులతో హైదరాబాదులో నిన్న జరిగిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ..... కుటుంబ డిజిటల్ కార్డుల జారీ కోసం ప్రతి నియోజకవర్గంలోని ఒక పట్టణం ..., గ్రామంలో పైలట్ ప్రాజెక్టు చేపట్టాలని ఆదేశించారు. "వన్ స్టేట్ ...., వన్ డిజిటల్ కార్డు" విధానం ప్రవేశపెట్టాలని ప్రభుత్వం యోచిస్తోందని ...., రేషన్ .... ఆరోగ్య సేవలతో పాటు సంక్షేమ పథకాలన్నీ ఒకే కార్డు ద్వారా అమలు జరిగేలా చర్యలు తీసుకోవాలని..., ఈ కార్డు ద్వారా రాష్ట్రంలో ఎక్కడైనా సంక్షేమ పథకాలు పొందేలా చూడాలని రేవంత్ రెడ్డి ఆదేశించారు.

---------------------------

చేనేత, హస్తకళల రంగంలో ఉన్నవారి అభివృద్ధికి నూతన విధానాలు అమలు చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. మారుతున్న కాలానికి అనుగణంగా ఉత్పత్తుల తయారీలో మార్పులు చేపట్టి చేనేత, హస్త కళాకారుల ఆదాయం పెంచే మార్గాలు అమలు చేయాలన్నారు. ఈ శాఖలో పరిస్థితులు, స్థితిగతులపై ముఖ్యమంత్రి నిన్న సమగ్ర సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... 35 చేనేత, 36 హస్తకళల క్లస్టర్ల అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించి పలు సూచనలు చేశారు. ఉత్పత్తులను ఆధునీకరించడం, టెక్నాలజీ వాడకం, మార్కెట్ సౌకర్యం కల్పించడం ద్వారా చేనేత, హస్తకళాకారుల ఉత్పత్తులకు డిమాండ్ పెంచవచ్చని... తద్వారా ఆ వర్గాల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.

---------------------------

తెలంగాణా రాష్ట్రంలో రైతుల నుండి ధాన్యం కొనుగోలు చేయడానికి రాష్ట్ర వ్యాప్తంగా 7 వేల 139 కేంద్రాలను ఏర్పాటు చేస్తామని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు.

ధాన్యం కొనుగోలు అంశంపై నిన్న హైదరాబాదు నగరంలో జరిగిన ఉన్నత స్థాయి సమావేశంలో అధికారులతో సమీక్షించారు. రైతుల నుండి ప్రభుత్వం ప్రతి గింజా కొనుగోలు చేస్తుందని స్పష్టం చేశారు. సన్నాలు..., దొడ్డు వడ్లకు వేర్వేరుగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తామని ...., ఖరీఫ్ సీజన్ లో 146 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా వేస్తున్నామని ..., ఖరీఫ్ నుండి సన్నాలు రకానికి అయిదు వందల రూపాయల మేర బోనస్ ఇవ్వనున్నామని ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు.

---------------------------

ఆంధ్ర ప్రదేశ్ లో ఇటీవల సంభవించిన భారీ వర్షాలు … వరదల కారణంగా నష్టపోయిన ప్రజలకు ఆర్థిక సహాయం అందజేయడానికి సంబంధించి ముఖ్య మంత్రి ఎన్. చంద్ర బాబు నాయుడు చేసిన ప్రకటనకు అనుగుణంగా రాష్ట్ర రెవిన్యూ శాఖ నిన్న ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఉత్తర్వుల ప్రకారం 179 గ్రామ …, వార్డు సచివాలయాల పరిధిలో ఇళ్లు పూర్తిగా నీట మునిగిన వారికి 25 వేల ఆర్థిక సహాయం అందజేస్తారు. మొదటి అంతస్తులో ఉన్న ముంపు బాధితులకు 10 వేల రూపాయలు, దెబ్బతిన్న దుకాణాలకు 25 వేలు …, వ్యవసాయ పంటలకు హెక్టారుకు 25 వేల రూపాయల మేర ఆర్థిక సహాయం అందజేయనున్నట్లు రెవిన్యూ శాఖ ఉత్తర్వులు పేర్కొన్నాయి.

---------------------------

ఆంధ్ర ప్రదేశ్‌లో నిర్మాణంలో ఉన్న సాగు నీటి ప్రాజెక్టులను త్వరలో పూర్తి చేస్తామని జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. చిత్తూరు జిల్లా పలమనేరు నియోజకవర్గం పెద్ద పంజాని మండలం అప్పినపల్లిలో కుప్పం బ్రాంచ్ కెనాల్ ను నిన్న ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ…… కేంద్ర ప్రభుత్వం అందించే నిధులతో నిర్మాణంలో ఉన్న అన్ని సాగు …, తాగు నీటి ప్రాజెక్టులను పూర్తి చేసి ప్రజలకు నీటి సమస్య రాకుండా చర్యలు తీసుకుంటామని రామానాయుడు వివరించారు.

---------------------------

ఆంధ్ర ప్రదేశ్ లో తెలుగు దేశం …., జన సేన …., భారతీయ జనతా పార్టీల కూటమి ప్రభుత్వం వంద రోజుల పాలన పూర్తయిన సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల దృష్టికి తీసుకు వెళ్ళే ఉద్దేశ్యంతో వివిధ ప్రాంతాలలో "ఇది మంచి ప్రభుత్వం" పేరుతో అవగాహన కార్యక్రమాలు జరుగుతున్నాయి. వివిధ ప్రాంతాలలో జరిగిన ఈ కార్యక్రమాలలో మంత్రులు పాల్గొని కూటమి ప్రభుత్వం ఇప్పటి వరకు చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను …. భవిష్యత్‌లో చేపట్టనున్న కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. నిన్న నెల్లూరు నగరంలో జరిగిన కార్యక్రమంలో పురపాలక …, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి. నారాయణ …., పార్వతీపురం మన్యం జిల్లా పాచిపెంట మండలం పాంచాలి గ్రామంలో మహిళా …, శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి పాల్గొనగా …., తూర్పు గోదావరి జిల్లా నిడదవోలు రూరల్ మండలం డి. ముప్పవరం గ్రామంలో జరిగిన కార్యక్రమంలో పర్యాటక…, సాంస్కృతిక శాఖ మంత్రి కందుల దుర్గేష్ పాల్గొన్నారు.

---------------------------

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంలో కీలక పాత్ర పోషించే పారిశుద్ధ్య కార్మికులకు సఫాయి సురక్ష కార్యక్రమం కింద ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నామని ఆంధ్రప్రదేశ్ కార్మిక శాఖ మంత్రి వాసం శెట్టి సుభాష్ తెలిపారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా రామచంద్రాపురం ఆస్పత్రిలో స్వచ్ఛత హీ సేవా కార్యక్రమాల్లో భాగంగా పారిశుద్ధ్య కార్మికులకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించే కార్యక్రమాన్ని నిన్న ఆయన ప్రారంభిస్తూ …. పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలన్న ఉద్దేశ్యంతో కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో ఈ నెల 17వ తేదీ నుండి అక్టోబర్ ఒకటవ తేదీ వరకు దేశ వ్యాప్తంగా స్వచ్ఛత హి సేవా కార్యక్రమాలు జరుగుతున్నాయని …., రాష్ట్ర ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని ప్రత్యేక దృష్టి సారించి నిర్వహిస్తోందని చెప్పారు. పారిశుద్ధ్య కార్మికులు ఉచిత వైద్య పరీక్షల కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని మంత్రి సుభాష్ కోరారు. ఇదిలా ఉండగా …. నిడదవోలులో జరిగిన స్వచ్ఛత హి సేవా కార్యక్రమంలో రాష్ట్ర పర్యాటక …, సాంస్కృతిక శాఖ మంత్రి కందుల దుర్గేష్ పాల్గొన్నారు.

---------------------------

తెలంగాణా రాష్ట్రంలో భారీ వర్షాలు ..., వరదల వల్ల నష్టపోయిన రైతులకు ప్రభుత్వం ప్రకటించిన ఆర్థిక సహాయాన్ని అందజేయనున్నట్లు రెవిన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు.

ఖమ్మం జిల్లా నేలకొండపల్లి పట్టణంలో నిన్న జరిగిన ఒక కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.... రెండు రోజులలో రైతులకు ఆర్థిక సహాయం అందేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.

---------------------------

పశ్చిమ మధ్య బంగాళా ఖాతం, మయన్మార్ దక్షిణ తీరం, దాని పరిసర ప్రాంతాలలో కొనసాగుతున్న రెండు ఉపరితల ఆవర్తనాలు విలీనమై మధ్య బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనంగా ఏర్పడే అవకాశం ఉందని, దీని ప్రభావంతో ఆంధ్ర ప్రదేశ్, తెలంగాణా రాష్ట్రాలలోని అనేక ప్రాంతాలలో రానున్న మూడు రోజుల పాటు తేలిక పాటు నుండి ఒక మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. ఉరుములు, మెరుపులతో పాటు గంటకు 30 నుండి 40 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయని కూడా పేర్కొంది. ఇదిలా ఉండగా ... హైదరాబాదు నగరంలో నిన్న సాయంత్రం అనేక ప్రాంతాలలో వర్షం కురిసింది. రహదారులపై నీరు నిలిచి పోవడంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

---------------------------

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన ఎన్డీయే ప్రభుత్వం తొలి వంద రోజుల పాలన పూర్తి చేసుకుంది. ఈ వంద రోజుల్లో వికసిత్ భారత్ దిశగా మోదీ 3.0 పాలన సాగింది. ప్రజల జీవితాలపై సానుకూల ప్రభావం చూపే విధంగా, తద్వారా వికసిత్ భారత్ 2047 కోసం బలమైన పునాది వేస్తూ, మొదటి 100 రోజుల్లో ప్రధానమంత్రి అనేక ముఖ్యమైన నిర్ణయాలను తీసుకున్నారు. కాగా ఎన్డీఏ ప్రభుత్వం వంద రోజుల పాలనపై ఆకాశవాణి విజయవాడ ప్రాంతీయ వార్తా విభాగం రూపొందించిన ప్రత్యేక కార్యక్రమం ఈ రోజు ఉదయం 10 గంటలకు ప్రసారమవుతుంది.

---------------------------

తిరుమల శ్రీ వారి లడ్డూ కల్తీ జరిగిన ఘటనపై ప్రత్యేక విచారణ సంఘం నివేదిక అందిన వెంటనే ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని ఆంధ్ర ప్రదేశ్ దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి తెలిపారు.

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా ఆత్మకూరులోని శ్రీ అలఘునాథ స్వామి వారి ఆలయంలో నిన్న జరిగిన సంప్రోక్షణ కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ.... లడ్డూ ప్రసాదంలో జరిగిన తప్పిదానికి ప్రజలంతా ఆందోళన చెందుతున్నారని పేర్కొన్నారు.

=====================